మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# ఓటమిని జయించి..
# విజయంగా మలిచి..



- గద్వాల నుంచి ఢిల్లీ దాకా..
- అసెంబ్లీ నుంచి పార్లమెంట్ దాకా..
- పాదయాత్రల నుంచి విజయ యాత్రల దాకా..
- అరుణమ్మ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం..
- ఉమ్మడి పాలమూరుపై చెరగని ముద్ర
- రాష్ట్ర రాజకీయాల్లోనే ఫైర్ బ్రాండ్..
- పార్లమెంట్‌లో ఎంపీగా

ప్రమాణ స్వీకారం సందర్భంగా 'ప్రత్యేక' కథనం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 24, ప్రభాతవార్త:** డీకే అరుణ.. ఈపేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు..ఎన్నో ఓటములు, మరెన్నో ఒడిదుడుకులు.. ఇటు పుట్టినిల్లు, అటు మెట్టినిల్లు నుంచి రాజకీయం వారసత్వం ఉన్నా.. తనదైన మార్క్ రాజకీయంతో ఎంతో పేరు తెచ్చుకున్నారు. ఓటమి చెందితే కృంగి పోలేదు..గెలిచే దాకా పోరాటం చేసి.. తాగునీటి, సాగు నీటి సమస్యలపై హైదరాబాద్ దాకా పాదయాత్ర చేపట్టి, పాలమూరు సమస్యలపై దీక్ష పట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన పాత్ర పోషించారు. గద్వాల నుంచి ఢిల్లీ దాకా..గల్లీ నుంచి పార్లమెంట్ దాకా తనదైన శైలిలో ముందుకు రాణిస్తూ, సమస్యలపై స్పందిస్తూ ..సవాళ్లను స్వీకరిస్తూ..విమర్శలపై గర్జిస్తూ పార్లమెంట్ లో అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక 'వార్త' కథనం.

**హ్యాట్రిక్ సాధించి..**

2004లో గద్వాల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన డీకే అరుణ వరుసగా మూడు సార్లు విజయం సాధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా పాలమూరుకు సేవలందించారు. 2019లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి పోటి చేసి స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైన అరుణ 2024లో కాంగ్రెస్ హవా కొనసాగుతున్నా పాలమూరు ఎంపీగా గెలిచి తన సత్తామరోసారి చాటారు.

**పంతంతో టికెట్ తెచ్చుకొని..**

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి డీకే అరుణతోపాటు అప్పుడు బీజేపీలో ఉన్న బండారి శాంతికుమార్, ఏపీ జితేందర్‌రెడ్డి కూడా టికెట్ ఆశించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం టికెట్ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు కేటాయిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకున్నది. బీజేపీ ఎంపీ అభ్యర్థుల రెండో జాబితాలో ఆమె పేరును ఖరారు చేస్తూ అధిష్టానం ప్రకటించడంతో దీంతో డీకే అరుణ అభిమానులు, పార్టీ శ్రేణులు

– మిగతా3లో..

## ఆర్ఐ వెంకట్‌రెడ్డి సస్పెండ్..



**బాలానగర్,జూన్ 24 ప్రభాతవార్త :** బాలానగర్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వెంకట్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హేమాజీపూర్ గ్రామంలోని ఒక సర్వే నంబర్‌కు సంబంధించి ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణల నేపథ్యంలో, మరో వర్గం రైతులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అధికారులు గతంలో ఆర్ఐకి మెమో జారీ చేసినట్లు విచారణ పూర్తయిన తర్వాత ఇప్పుడు ఆర్ఐ వెంకట్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ఆర్ఐ వెంకట్‌రెడ్డి రహస్యంగా విధులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ ఆదివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బాలానగర్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సంగతి తెలిసిందే. ఆర్ఐ వెంకట్‌రెడ్డి గతంలోనూ పంచనామాలు చేయడానికి డబ్బులు వసూలు చేశారని పలు ఆరోపణలు ఉన్నాయంటూ ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలుపగా సోమవారమే ఆర్ఐను సస్పెండ్ చేయడం గమనార్హం.

## 3నెలల వరదతో రూ.60కోట్ల
# విద్యుత్ ఉత్పత్తి...



ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రి, ఎమ్మెల్యేలు

- 4వ పవర్ యూనిట్ పునరద్ధరణకు నిర్లక్ష్యం వీడాలి
- నిధులు ఎన్నైనా కేటాయిస్తాం... ప్రతిపాదనలు పంపించండి...
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి చేసే హైడల్ పవర్ ఉత్పత్తిని పెంచుదాం...
- అగ్ని ప్రమాద ఘటన బాధకరం...
- ఎడమ విద్యుత్ ఉత్పత్తి అధికారులతో సమీక్ష...
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



జెన్‌కో అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం





సారంగం గట్టులో 4వ పవర్ యూనిట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

**అచ్చంపేట, జూన్ 24 ప్రభాతవార్త:** దేశంలోనే అత్యంత గొప్పదైన శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు సంపదను కాపాడుకోవడం ప్రజా ప్రభుత్వం బాధ్యత అని, రానున్న 3 నెలల్లో వచ్చే వరదతో 60 కోట్ల విద్యుత్ ఉత్పత్తిని తయారు చేస్తామని, అందుకు వెంటనే పునరద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. రాష్ట్రానికి అత్యంత విలువైన సంపద శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం సమకూరుతుందని,కేవలం రూ.2కోట్లతో 4వ పవర్ యూనిట్ పునరద్ధరణ చేపడితే సుమారు రూ.60కోట్ల ఆదాయం నష్టపోకుండా వస్తుందని, 4వ యూనిట్ పునరద్ధరణకు నిధుల కోరత లేదని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా అధికారులు టెండర్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేసి ఆ యూనిట్‌ను రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్‌లోని శ్రీశైలం ఎడమ జల విద్యుత్ ప్రాజెక్టును రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి,తూడి మేఘారెడ్డిలతో కలిసి శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ సొరంగంలోని విద్యుత్ ప్రాజెక్టును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సందర్శించి 4వ విద్యుత్ యూనిట్‌ను సందర్శించారు. ప్రాజెక్టు అంత పర్యవేక్షిస్తూ అధికారులను ప్రాజెక్టులో నెలకొన్న సమస్యలను, లాభాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో 4వ యూనిట్ పునరద్ధరణ రక్షణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీశైలం జెన్‌కో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన పవర్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. రాష్ట్రానికి అత్యంత విలువైన సంపద శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయ వనరు, రూ.60కోట్ల ఆదాయం నష్టపోకుండా కేవలం రూ.2కోట్లతో 4వ పవర్ యూనిట్ పునరద్ధరణకు ఏ మాత్రంనిర్లక్ష్యం చేయకుండా అధికారులు టెండర్ కార్యక్రమాన్ని పూర్తి చేసి ఆ యూనిట్‌తో రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్‌ఎల్‌బీసీ గర్వకారణమని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించి యూనిట్ పునరద్ధరణ చేయడంలో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్ట్ సంస్థలను బ్లాక్ జాబితాలో చేర్చి రద్దు చేయడం మంచిదని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ పవర్ హౌస్‌లో 2020 సెప్టెంబర్‌లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాద ఘటన తీవ్ర బాధకరమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆ సమయంలో యూనిట్‌ను కాపాడేందుకు శ్రమించిన జెన్‌కో సిబ్బంది ప్రయత్నంలో కొంత మంది ప్రాణాలు కోల్పోయారని, ఆ కుటుంబాలకు ప్రగాడ సానుభూతిని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ఎప్పుడు ఏ అవసరం ఉన్న ప్రభుత్వ అండదండలు మెండుగా ఉంటాయని ఆయన తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టుల్లో పనిచేసే క్రింది స్థాయి సిబ్బంది నుంచి ఐఎస్ వరకు చేసిన కృషి ఎనలేనిదని ఆయన కొనియడారు. ఏ ఒక్క కార్మికుడికి ప్రాణహాని ముప్పు లేకుండా అత్యంత పకడ్బంది వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. వ్యవస్థలోని ఆస్తులను సృష్టించడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గతంలో చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఏదేని ప్రమాదాలు చోటు చేసుకుంటే తక్షణం జాగ్రత్త పడే చర్యలు ఏమైన తీసుకున్నారా అని అధికారులను అడిగారు. ఈ సందర్భంగా అధికారులు సమాధానమిస్తూ గత పరిణామాలను దృష్టిలో ఉంచుకొని భద్రత చర్యలు తీసుకున్నామని సమాధానమిచ్చారు.

# రెప్పపాటు కరెంట్ కోతలు లేవు...

- రైతు జీవితంలో వెలుగులు నిండాలి...
- ఉభయ రాష్ట్రాల ప్రజలకు భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆశీస్సులు ఉండాలి....
- శ్రీశైలం హైడల్ ద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తికి సమీక్ష
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క...



మలన్న స్వామి సన్నిధిలో డిప్యూటీ సీఎం దంపతులు, మంత్రి, ఎమ్మెల్యేలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రైతు సుభిక్షంగా ఉండేందుకు రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పర్చేందుకు రెప్పపాటు కరెంట్ కోతలు లేకుండా చూస్తూ తెలంగాణ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం మల్లిఖార్జునస్వామి దర్శనానికి హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరారు. మార్గమధ్యలో నాగర్‌కర్నూల్ జిల్లాలో వెల్దండ, వంగూరు, మన్ననూరు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు నాగర్‌కర్నూల్ జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికి గజామాలతో సన్మానించారు. శ్రీశైలం మల్లిఖార్జునస్వామి దర్శనం కోసం మల్లన్న సన్నిధికి చేరుకోవడంతో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో భ్రమరాంబ మల్లిఖార్జునస్వామిని కుటుంబ స్వామిని దర్శించుకొని ఆలయ అర్చకులు శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆశీస్సులు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుభిక్షంగా లభించి సకాలంలో రుతు పవనాలు అందుబాటులోకి వచ్చి వర్షాలు సమృద్ధిగా కురిసి రైతన్నలు సాగు చేసిన పంటలు సమృద్ధిగా పండి రైతన్న అభివృద్ధి చెందే విధంగా చూడాలని మల్లన్న స్వామిని వేడుకున్నానని ఆయన తెలిపారు. కరువు కటాకాలు లేకుండా ఉభయ రాష్ట్రల ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రపంచంలో తెలుగు వారు ఎక్కడ ఉన్న ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలన్నారు. రుతు పవనాలు రాకముందే శ్రీశైలం హైడల్ ప్రాజెక్టును సమీక్షించి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన చర్యలు చేపట్టడమే తన పర్యటన ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పెద్దలు ముందు చూపుతూ నిర్మించిన బహుళార్థక సార్థక ప్రాజెక్టుతో మన జీవితాల్లో వెలుగులు నిండాయని ఆయన గుర్తు చేశారు. అమరులకు నివాళులర్పించారు. శ్రీశైలం హైడల్ ప్రాజెక్టు ద్వారా అత్యధిక స్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నామని, తెలంగాణ రాష్ట్రంలో రెప్పపాటు కరెంట్ కోతలు లేవని, 2029-30 వరకు కావాల్సిన విద్యుత్ తెలంగాణ రాష్ట్రంలో అందుబాటులో ఉంటుందన్నారు. ఉమ మహేశ్వర సమీపంలోని నిరంజన్ షా వలీ దర్గాలో డిప్యూటీ సీఎం పాల్గొని దర్గాపై చాదర్ సమర్పించి ప్రత్యేక ఫాతిహాలో పాల్గొన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



దర్గాలో ప్రత్యేక ఫాతిహాలో డిప్యూటీ సీఎం, మంత్రి, ఎమ్మెల్యేలు

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయి.. ప్రజావాణికి 109 దరఖాస్తులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 24 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఆర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 109 మంది దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని అన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండలాల తహసిల్దార్‌లతో మాట్లాడుతూ వారి పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే జాప్యం లేకుండా పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు ఆర్జీలు కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు అందజేశారు. ముఖ్యంగా రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్సు, పంచాయతీ, పెన్షన్‌లు,డబుల్ బెడ్‌రూం, ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమం, ఇతర శాఖలకు సంబంధించినవి ఆర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

**దరఖాస్తుల వెల్లువ...** ప్రజావాణికి సోమవారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. సగానికంటే ఎక్కువ దరఖాస్తులు రెవెన్యూ, భూ సంబంధిత కార్యకలాపాలకు ధరణి పెండింగ్ దరఖాస్తులకు సంబంధించినవే ఉన్నాయి. ఉదయం 9.30 గం.ల నుంచి కలెక్టరేట్‌కు ఫిర్యాదుదారులు బారులు తీరారు. కలెక్టర్ ప్రతి ఒక్కరి దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి కెవివి రవికుమార్ జడ్పీ సీఈఓ రాఘవేందర్ రావు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**బాలానగర్,జూన్ 24 ప్రభాతవార్త :** మండల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీగా తొలి సారి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కామన్ విజిట్‌గా మేడం సందర్శించారని ఎస్సై తిరుపాజీ తెలిపారు. లా అండ్ ఆర్డర్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, చట్టాన్ని ఎవరు కూడా తమ చేతుల్లోకి తీసుకోకూడదని ఎస్పీ సూచించారు. శాంతియుత సమాజం కోసం పౌరులు అందరు సహకరించాలని కోరారు. పోలీస్ సిబ్బంది కూడా సమాజ శ్రేయస్సు రక్షణ కొరకే పని చేస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపాజీతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

# ధరణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి..



ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి జూన్ 24 ప్రభాతవార్త :** ప్రజల సమస్యలపై సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో తహసిల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో ధరణి, భూమి మార్కెట్ విలువలు, విద్యుత్ సబ్ స్టేషన్లకు భూసేకరణ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూ రికార్డుల పరిరక్షణ, ధరణి దరఖాస్తుల పరిష్కారం పై తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. హిందూ సక్సెషన్ యాక్టు ను బాగా చదవాలని, భూ రికార్డుల యాక్టును క్షుణ్ణంగా చదివి ధరణి సమస్యలు పరిష్కరించాలన్నారు. భూ బదలాయింపు ఎన్ని రకాలుగా ఉంటాయి వాటిని ఏవిధంగా నిర్ధారించుకోవాలి అనేది పూర్తి అవగాహన ఉండాలి అన్నారు. తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. పెండింగ్ మ్యూటేశన్, సక్సెషన్, కరెక్షన్ వంటి సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలని అనేది అవగాహన కల్పించారు. తహసిల్దార్లు, ఆర్డీఓ తమ లాగిన్ లో ఉన్న ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

భూమి మార్కెట్ విలువల నిర్ధారణ రిజిస్ట్రేషన్ లో భూమి మార్కెట్ నిర్ధారిత విలువ చాలా కాలం నుండి ఒకే విధంగా ఉందని, కాలానుగుణంగా మారిన సరాసరి మార్కెట్ విలువ నిర్ధారించి మండలం వారీగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సి.యం.ఆర్ ధాన్యం అప్పగింత వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో రైస్ మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేసి ధాన్యాన్ని ఎఫ్.సి.ఐ కి అందించడం లేదన్నారు.

- ప్రభుత్వ భూమిని ఎట్టిపరిస్థితుల్లోనూ పట్టా భూమి చేయొద్దు...!
- హిందూ సక్సెషన్ యాక్ట్ ను క్షుణ్ణంగా చదవండి - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి...!
- ధరణి పెండింగ్ దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి...!
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

అందువల్ల తహసిల్దార్లు తమ పరిధిలోని రైస్ మిల్లులపై ఒత్తిడి పెంచాలని ఆదేశించారు. సకాలంలో ధాన్యం అప్పగింత జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు భూకేటాయింపు సమస్యలు విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు తహసీల్దార్లు భూమి సేకరించి విద్యుత్ శాఖకు కేటాయించే క్రమంలో ఉన్న ఇబ్బందులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసులు ఉంటే వాటిని క్షుణ్ణంగా చదివి తదుపరి చర్యలు చేపట్టి త్వరగా భూమి కేటాయించాలన్నారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, ఆర్డీఓ పద్మావతి, వనపర్తి సబ్ రిజిస్ట్రేషన్ రాజేష్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి :జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి జూన్ 24 ప్రభాతవార్త :** ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించటంలో అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సోమవారం ఐ.డి.ఓ.సి లోని ప్రజావాణి హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్‌తో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజావాణి

–మిగతా4లో..



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్

## ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలి...

**అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు...**

**గద్వాల ప్రతినిధి జూన్ 24 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ముసిని వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 45 మంది ఫిర్యాదు దారులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని అయన తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే జాప్యం లేకుండా జిల్లా అధికారులు పరిష్కరించాలని అయన అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 45 దరఖాస్తులలో 2 ఆసరా పెన్షన్లు, 3 ధరణి సమస్యలతో పాటు ఇతర శాఖలకు సంబంధించినవి 40 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రాంచందర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

## మల్లెవారిసాహెబ్ దర్గా ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**దేవరకద్ర, జూన్ 24 ప్రభాతవార్త:** దేవరకద్రలో సోమవారం మల్లెవారిసాహెబ్ దర్గా ఉర్సు వేడుకల సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాపై ఎమ్మెల్యే పూలచాదర్‌కప్పి ఫాతెహ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాకు మొట్టమొదటి సారి వచ్చిన ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, జమీల్, అంజత్, ఫారూఖ్‌అలి, ఇనాయత్, జాహెద్‌అలి, ఖదుబొద్దీన్, యూసుఫ్, హన్మంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఆదిహన్మంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నరిసింహ్మారెడ్డి, రఘువీరవర్మ, కొండ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, రాంపండు, నర్వ శ్రీనివాస్‌రెడ్డి, జమీల్, జవహార్, ఫారూఖ్, ఇనాయత్, కుద్బూ, శ్రీనివాస్‌సాగర్‌లతోపాటు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ఫాతెహాలో పాల్గొన్న ఎమ్మెల్యే

## హమాలీ కార్మికులకు కూలీ పెంపు పట్ల హర్షం

**మక్తల్, జూన్ 24 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో పని చేస్తున్న బజారు హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచుతూ యాజమాన్యాలు నిర్ణయం తీసుకోవడం పట్ల ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కిరణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మక్తల్‌లో ఫర్టిలైజర్ అసోసియేషన్ యజమానులకు, బజారు హమాలీ కార్మికుల మధ్య చర్చలు జరిగాయి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు కూలీ రేట్లు పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించడంతో చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. పెరిగిన కూలీ రేట్లు మంగళవారం నుండి అమలులోకి వస్తున్నాయి. ఈ చర్చలలో ఫర్టిలైజర్ అసోసియేషన్ తరపున మోహన్‌రెడ్డి, సంగంబండ వెంకట్‌రెడ్డి, హనుమంతు, ఆంజనేయులు, రాములు, రామ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, హమాలీ కార్మికులు లక్ష్మణ్, అయ్యప్ప, ఆనంద్, నరసింహులు, మరాఠీ రాజు, మరాఠి నాగన్న, స్కైలాబ్, పాండు, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు నాయకులు

## జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని కలిసిన నాయకులు...

**వనపర్తి టౌన్ జూన్ 24 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి జిలల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది. వనపర్తి జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పట్టణ అద్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కదిరే రాములు, నందిమల్ల యాదయ్య ,నారాయణ పెంటన్న, రాములు యాదవ్, తోమలపల్లి మన్యం, వెంకటరత్నం నాయుడు, కుమ్మరి గోవిందు, దివాకర్, రోహిత్, బాబా, గద్దం వినోద్, రాగి అక్షయ్, నరసింహ, రవి, రాము, బహుజన రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కి సన్మానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## మంత్రివర్గ విస్తరణలో బిసిలకు పెద్దపీట వేయాలి

**బిజినేపల్లి, జూన్ 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసిలకు పెద్దపీట వేసి, ఎక్కువ మంది బిసి బిడ్డలను మంత్రి వర్గంలోకి తీసుకోవాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతుగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 10 శాతం లేని అగ్రకుల ఆధిపత్యాలకు రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ కులాలకు మంత్రి పదవులు ఇచ్చి రాష్ట్రంలోనే అత్యధిక 50 శాతం కలిగిన బిసికులాల్లో ముదిరాజ్, మున్నూరు కాపు, రజక ఇలాంటి వెనుకబడిన కులాలకు మంత్రి పదవుల్లో అవకాశం లేకుండా ఆధిపత్యాలకు అగ్ర తాంబూలాలు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఈ మంత్రి వర్గ విస్తరణలో ముఖ్యమంత్రి ఇలాంటి వెనుకబడిన కులాలకు ప్రాతినిధ్యం ఇస్తూ క్యాబినెట్‌లో చోటు కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, అదే విధంగా ఎమ్మెల్సీగా గెలుపొందిన మున్నూరు కాపు వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్న, షాద్‌నగర్ ఎమ్మెల్యే రజక కులానికి చెందిన వీర్లపల్లి శంకర్ తదితర బిసిలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఆయన కోరారు. మంత్రివర్గంలో భర్తీ చేయాల్సిన 6 స్థానాల్లో బిసిలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించి మంత్రులుగా ఎక్కువ మందికి అవకాశం ఇవ్వాలని భగవంతుగౌడ్ కోరారు.




మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భగవత్‌గౌడ్

### మానవ మనుగడకు అభివృద్ధికి

## పర్యావరణం అత్యంత ఆవశ్యకం

**పర్యావరణ వారోత్సవాల సందర్భంగా మండల నోడల్ అధికారి అనిల్‌గౌడ్**

మక్తల్ టౌన్, జూన్ 24 ప్రభాతవార్త : పర్యావరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మక్తల్‌లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారి అనిల్‌గౌడ్ మాట్లాడుతూ మానవ మనుగడకు అభివృద్ధికి పర్యావరణం ఎంతో అత్యంత ముఖ్యమైనదని, పర్యావరణ పరిరక్షణ అనేది అందరి బాధ్యత అని దీనిలో భాగంగా అందరు కూడా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలి, నీటిని పొదుపుగా వాడాలని, వ్యర్థ పదార్థాలను ఎరువుగా మార్చాలని, విద్యార్థి దశనుంచే మీరందరూ కూడా పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని అన్నారు. మనందర ము ఈనాడు రక్షింపబడాలి, భావితరాలను కూడా రక్షించాలనే నినాదంతో విద్యార్థులచే నినాదాలు ఇప్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అరుణ నాగార్జునసాగర్, రాంగోపాల్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# దేవరకద్రలో విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

**- డిగ్రీ కళాశాల భవన నిర్మాణం అయ్యేవరకు ఇంటర్ కళాశాల భవనంలోనే తరగతులు**

**- డిగ్రీ కళాశాల మంజూరు చేయడంతో ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు**

**దేవరకద్ర, జూన్ 24 ప్రభాతవార్త:** దేవరకద్రలో సోమవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి విద్యాశాఖ అధికారులు, ఇంటర్ మీడియట్ ఆధ్యాపక బృందంతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకొన్నారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణం పూర్తి అయ్యేవరకు ప్రస్తుతం నడుస్తున్న ఇంటర్ కళాశాల భవనంలోనే ఈ విద్యాసంవత్సరానికి డిగ్రీ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. దేవరకద్రకు డిగ్రీ కళాశాల మంజూరు చేయడంతో ముఖ్యమంత్రికి, ఆర్థిక అనుమతులు ఇచ్చిన భట్టి విక్రమార్కలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటి డిగ్రీ కళాశాల దేవరకద్రకు కెటాయించడం సంతోషకర విషయమన్నారు. ఈ విద్యాసంవత్సరం నుండి డిగ్రీ కళాశాల ప్రక్రియ మొదలైందన్నారు. బిఎస్సీ పిజికల్ సైన్స్ యంపీసి, యంపిసిఎస్‌లో 60 సీట్లు, బిఎస్సీ లైఫ్ సైన్స్‌లో బిజెడ్‌సీలో 60 సీట్లు, బిఏ హెచ్‌ఈపిలో 60 సీట్లు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 60 సీట్లు మొత్తం 240 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 28వ తేది నుండి దోస్త్ యాప్‌లో వెబ్ ఆప్షన్‌లో నమోదు చేసుకోని విద్యార్థులు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌లు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికా ప్రతినిధి గాల్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్, జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్‌లతో పాటు టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఆదిహన్మంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నరిసింహ్మారెడ్డి, రఘువీరవర్మ, కొండ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, రాంపండు, నర్వ శ్రీనివాస్‌రెడ్డి, జమీల్, జవహార్, ఫారూఖ్, ఇనాయత్, కుదబ్బా, శ్రీనివాస్‌సాగర్‌లతో పాటు మండలంలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

## అధిక ఫీజులతో బెంబేలెత్తుతున్న తల్లిదండ్రులు..

**కొన్ని ప్రవేటు పాఠశాలలోనే పుస్తకాలు, యూనిఫారం అమ్మకాలు.. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలపై నిఘా ఏది..?**

**చిన్నచింతకుంట, జూన్ 24 ప్రభాతవార్త :** ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులు వసూళ్లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, డ్రస్సుల పేరిట చేస్తున్న దోపిడీని అడ్డుకోవాలని, మండల కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు మొహినుద్దిన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009 చట్టం 12 (1) (సి) ప్రకారం ప్రతి పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు విద్యాభ్యాసం కొరకు 25 శాతం సీట్లు కేటాయించి ఉచితంగా విద్యాబోధన అందించాలన్నారు. కనీస అవసరాలు, మౌలిక వసతులను పూర్తి స్థాయిలో పాఠశాలల యాజమాన్యం నిర్వహించే విధంగా తనిఖీలు చేపట్టాలన్నారు. చట్ట విరుద్ధంగా నిర్వహించే పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడకుండా విద్యార్థులు స్వేచ్ఛ వాతావరణంలో విద్యనభ్యసించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల వసూళ్లతో విద్యార్థులు తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తూ వారిని మనోవేదనకు గురి చేస్తున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూళ్లపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



మొహినుద్దిన్

## జాతీయ క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

**చిన్నచింతకుంట, జూన్ 24 ప్రభాతవార్త :** ఈనెల 6,7 తేదీలలో వరంగల్ జిల్లా హనుమకొండ పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 3 పతకాలు సాధించిన అల్లిపూర్ గ్రామానికి చెందిన డి. నవీన్‌ను తన స్వగృహంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అభినందించి, ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10వ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 2024 పోటీలలో సీనియర్ కేటగిరిలో డెకతలోన్ విభాగంలో బంగారు పతకం, 4 400 మీటర్ల రిలే రన్నింగ్ విభాగంగా రజత పతకం, 110 మీటర్ల హార్డిల్స్ విభాగంలో కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమని కొనియాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణించి మరెన్నో పతకాలు సాధించి, మన రాష్ట్రానికి, మన దేశానికి మంచిపేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. అనంతరం క్రీడాకారునికి రూ. 20వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అల్లీపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దామోదర్ యాదవ్, మాజీ అధ్యక్షులు డి. బాలస్వామి, గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు బి. ఆంజనేయులు అల్లిపురం మిని ఇండోర్ స్టేడియం జూనియర్ అసిస్టెంట్ జి.నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించిన క్రీడాకారున్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల రిమాండ్

**మాగనూరు, జూన్ 24 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్క్కూరు గ్రామంలో రెండు ఇండ్లలో దొంగతనాలకు పాల్పడిన వారి వివరాలను డీఎస్పీ తెలిపారు. తేది. 20.06.224 అర్ధరాత్రి వర్క్కూర్ గ్రామంలో తాళం ఉన్న ఇంటికి తాళాలు పగులగొట్టి బంగారు నగలు, వెండి వస్తువులను దొంగతనం చేయగా వర్క్కూర్ గ్రామానికి చెందిన ఇంటి యజమాని బొజ్జమొల్ల సుజాత ఫిర్యాదు మేరకు 21.06.2024న మాగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సోమవారం ఉదయం 7 గం.లకు మాగనూరు పోలీస్‌వారికి నమ్మదగిన సమాచారం మేరకు నల్లగట్టు మారెమ్మ గుడి దగ్గరలో ఇద్దరు అనుమానితులను పట్టుకుని విచారించగా వారిలో ఒక వ్యక్తి వర్క్కూర్ గ్రామానికి చెందిన ఊరి ముందర నరేష్ అలియాస్ కార్తీక్ తండ్ర లక్ష్మప్ప అతని స్నేహితుడు కర్నూల్ జిల్లా దేవనకొండ మండలం, పి. కోటకొండ గ్రామానికి చెందిన బోయ వీరేంద్ర తండ్రి లేట్ ఉరుకుంద ఇద్దరు గత 3 నెలలుగా పరిచయం ఏర్పడి ఇద్దరు కలిసి జల్సాలకు అలవాటు పడ్డారు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో, ఇద్దరు కలసి అక్కడే రెండు రోజులు ఉండి రెక్కీ నిర్వహించి తాళాలు వేసిన ఇండ్లను అదును చూసి వర్క్కూర్ గ్రామంలోని నరేష్ ఇంటి వెనక ఉన్న రెండు ఇండ్లలో తాళం విరగ్గొట్టి 6 తులాల బంగారం రూ. 3 లక్షలు విలువగల బంగారం 1.5 తులాల వెండి, 200 చిల్లర, ఒక మొబైల్ దొంగతనం చేసినట్లు తెలిపారు. వారిని పోలీసులు పట్టుకుని విచారించి వారినుండి 5.5 తులాల బంగారు ఆభరణాలు (నెక్లెస్, లాంగ్‌చైన్, కమ్మలు, చిన్న ఉంగరం) 1.5 వెండి వస్తువులు, ఒక సాంసంగ్ మొబైల్ ఫోన్ రూ.8560 వారి నుండి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి నారాయణపేట కోర్టు ముందు హాజరు పరిచి కోర్టు ఆదేశాల మేరకు వారిని జైలుకు పంపడం జరిగిందని డీఎస్పీ ఎ. లింగయ్య తెలిపారు. ఈ కేసును రెండు రోజుల్లో ఛేదించినందుకు మక్తల్ సిఐ చంద్రశేఖర్, మాగనూరు ఎస్సై అబ్దుల్ ఖాదర్, హెడ్ కానిస్టేబుల్ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ రవిందర్, సాయికుమార్, రాజశేఖర్‌లను డీఎస్పీ అభినందించి వారికి త్వరలో రివార్డు అందిస్తామని తెలిపారు.

## ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు..

**ఆత్మకూర్ జూన్ 24 ప్రభాతవార్త :** మఖ్తల్ నియోజకవర్గం లోని ఆత్మకూరు పట్టణంలో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నట్లుగా తమ దృష్టికి రావడంతో ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తాహసిల్దార్ సి రాజు తదితరులు పట్టణంలోని ప్రభుత్వ భూములను సోమవారం రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సొంసాగర్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన 44 ఎకరాల 88 సెంట్లు భూమిని అప్పట్లో అధికారులు గుర్తించాలని ప్రస్తుతం కూడా అదే స్థాయిలో భూమి ఉన్న పక్షంలో ఎలాంటి పరిణామాలు కొనసాగించే వీలుండబోదని ఒకవేళ ప్రభుత్వ భూములను కబ్జా చేసిన పక్షంలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లుగా వారు వెల్లడించారు. అంతేకాకుండా పట్టణ శివారులోని శ్రీ పరమేశ్వర స్వామి చెరువు కట్ట సమీపంలో ప్రభుత్వ శిఖం భూమి కబ్జాకు గురవతున్నట్లుగా కొంతమంది ఫిర్యాదులు చేశారని ఆ ఫిర్యాదుల మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రభుత్వ భూములను పరిశీలించడం జరుగుతుందని ప్రభుత్వ భూములకు సంబంధించి ఒక్క సెంటు కబ్జా గురైన కూడా చట్టపరమైన చీరలు కఠినంగా ఉంటాయని వారు హెచ్చరించారు. పట్టణంలోని శివారు భూముల్లో ప్లాట్ ల కోసం వెంచర్లు ఏర్పాటు చేసుకోబోయే యజమానులు అన్ని రకాల అనుమతులు తీసుకున్న తర్వాతే ప్లాట్లు చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు శివారులో గల ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ తహసిల్దార్

## ఈనెల 26న పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయండి

**అమరచింత జూన్ 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 26న పాఠశాలలు బంధు నిర్వహిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు సాయి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన అన్నారు. ఇప్పటివరకు విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేయడం లేదని ఆయన అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తుందని ఆయన అన్నారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థలు యజమాన్యాలు విద్యార్థులతో బలవంతంగా యూనిఫామ్, బుక్స్‌లు కొనుగోలు చేస్తున్నారని విద్యాశాఖ అధికారులు తక్షణమే ప్రైవేట్ విద్యా సంస్థలపై దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 24 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌లను నియమించాలని ఆయన డిమాండ్ చేస్తూ ఈనెల 26న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అఖిల్, రాజేష్, ఆదిత్య, ఉదయ్ గౌడ్, సందీప్, రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో విద్యార్థుల సమస్యల పై మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర నాయకులు సాయికుమార్

## ఈనెల 30న ఖోఖో క్రీడాకారులకు సన్మానం

**మక్తల్, జూన్ 24 ప్రభాతవార్త :** జాతీయ ఖోఖో దినోత్సవం సందర్భంగా ఈనెల 30న మక్తల్ పట్టణంలో ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఖోఖో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఘనంగా సన్మానం నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత పిఈటి బి.గోపాలం తెలిపారు. ఇప్పటివరకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకున్నవారు ఈనెల 29లోగా తమ పేర్లను సెల్: 7702713139కు సమాచారం అందించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఖోఖో క్రీడాకారులు, కోచ్‌లు ఈ సన్మానానికి అర్హులని ఆయన తెలిపారు.



## దేవస్థానంలో అన్నప్రసాద కార్యక్రమం



**దేవరకద్ర, జూన్ 24 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ ఈశ్వరవీరప్పయ్య దేవస్థానంలో సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సోమవారం భక్తులకు దేవస్థానంలో అన్నప్రసాద వితవిరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే వెంకటాయపల్లికి చెందిన బంగారి బాలప్ప, మణెమ్మల అధ్వర్యంలో ఈ అన్నప్రసాద వితవిరణ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**బిజినేపల్లి, జూన్ 24 ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం అని డిసిసి ఉపాధ్యక్షులు బంగారి పర్వతాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ వారసులుగా సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలు మాటిస్తే మడమ తిప్పరని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

### పదిలో రాణించిన

## విద్యార్థినికి సన్మానం




**చిన్నచింతకుంట, జూన్ 24 ప్రభాతవార్త :** 10వ తరగతి పరీక్షల్లో 9.3 జిపిఎ సాధించి లాల్‌కోట జడ్పీ ఉన్నత పాఠశాల టాపర్‌గా నిలిచి అదేవిధంగా మండల టాపర్ ద్వితీయ స్థానాన్ని సాధించిన విద్యార్థిని భాగ్యను పాఠశాల జిహెచ్ఎం మురళీకృష్ణతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని సన్మానించి రూ. 5500ల నగదు బహుమతిగా అందజేశారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని జిహెచ్ఎం అభిప్రాయపడ్డారు. వచ్చే విద్యా సంవత్సరంలో పది పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటినుంచి చదువుపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ని కలిసిన బిజెవైఎం మండల అధ్యక్షుడు యాదిరెడ్డి



**కోయిల్‌కొండ, జూన్ 24 ప్రభాతవార్త :** కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ని సోమవారం మండల బిజెవైఎం అధ్యక్షులు యాదిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంలో ఆయనను కలిసి పూలమాలలతో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీని బలోపేతం చేస్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టడం శుభపరిణామం అన్నారు. బండి సంజయ్‌కుమార్ మరెన్నో పదవులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో
## రైఫిల్ షూట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**బాలానగర్, జూన్ 24 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కళాశాలలో నిర్వహించిన రైఫిల్ షూటింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రైఫిల్ షూటింగ్ క్రీడలో పాల్గొని బాలికలు



పతకాలు సాధించాలని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సౌమ్య, పీఈటి అరుణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్‌నాయక్, ఓబిసి జిల్లా ఛైర్మన్ తిరుపతి, వెంకట్‌రెడ్డి, నందమూని దత్తాత్రేయ, హరిసింగ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రఫీక్, యాదయ్య పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్కీ డిప్ ద్వారా కార్మికులను ఎంపిక చేస్తాం

**చేనేత శాఖ అధికారి గోవిందయ్య**

**గద్వాల ప్రతినిధి జూన్ 24 ప్రభాతవార్త:** గద్వాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్‌ను మంజూరు చేసిందని, లక్కిడిప్ ద్వారా కార్మికులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా డిప్ ద్వారా ఎంపికైన కార్మికులు మోటరైజ్డ్ జాబ్ కార్డ్సు కొరకు 10 శాతం లబ్ధిదారుని వాటాగా సప్లై చేసే సంస్థకు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఎంపికైన చేనేత కార్మికులు లబ్దిదారుని 10 శాతం వాటాగా క్రిందటి సంవత్సరం రేటు ప్రకారం రూ. 10 శాతం వాటాగా క్రిందటి సంవత్సరం రేటు ప్రకారం రూ.1500 జి.మహేశ్ సిడిఈ గద్వాల్ క్లస్టర్‌కు చెల్లించగలరని చెల్లించిన రూపాయలకు రసీదు పొందగలరని తెలిపారు. పరికరం యొక్క రేటు ఎక్కువ ఉన్నచో లబ్దిదారుడే చెల్లించవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ 10 శాతం వాటాను ఈనెల 27 లోగా చెల్లించగలరని తెలియజేశారు.

## పాలమూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నిక ఏకగ్రీవం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 24 ప్రభాతవార్త :** పాలమూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నిక ఏకగ్రీవం అయిందని ఎన్నికల అధికారి కె.టైటస్‌పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 డైరెక్టర్ పోస్టులకు గాను, 17 నామినేషన్‌లు రాగా అందులో ఐదుగురు వారి నామినేషన్‌లు విత్‌డ్రా చేసుకోవడం వల్ల డైరెక్టర్‌ల ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్‌ల నుండి సోమవారం



అధ్యక్ష, ఉపాధ్యక్ష పోస్టులను కూడా ఆ డైరెక్టర్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కండే కుమారస్వామి, సీనియర్ ఉపాధ్యక్షులుగా గుండ్ల కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా కలకొండ సూర్యనారాయణ, డైరెక్టర్‌లుగా ఎదిరే తమ్మయ్య, కల్వకన్నయ్యశెట్టి, డి.జ్యోతి, ఎన్. సంగమేశ్వర, పుల్ల శ్రీనివాస్, పోల నాగలక్ష్మి, రాగిరి తిరుపతయ్య, పాలాది రామ్మోహన్, జి. వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నికైన వారికి జిల్లా సహకార అధికారిని పద్మ, జాయింట్ రిజిస్ట్రార్ ధృవీకరణ పత్రాలు అందజేశారు.

## ఓటమిని జయించి.. విజయంగా మలిచి



**మొదటి పేజీ తరువాయి భాగం..**

పెద్ద ఎత్తు సంబురాలు సంబురాలు చేసుకున్నారు. డీకే అరుణకే గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని తెలియడంతో అధిష్టానం అమెకు మొగ్గు చూపింది. టికెట్ విషయంలో పంతం నెగ్గించుకున్న అరుణ సీఎం ఇలాఖాలో, 7అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నా బలంగా నిలబడి, తలబడి ఎన్నో విమర్శలు ఓర్చుకుని, ధీటుగా ప్రతి విమర్శలు చేస్తూ విజయ తీరాలకు చేరింది. బీజేపీ కేంద్ర అధిష్టానంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకొని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రేసులో ఉన్నట్లు సమాచారం.

**అరుణమ్మ పాదయాత్ర :** తన సొంత జిల్లాలో సాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గద్వాల నుంచి హైదరాబాద్‌కు డీకే అరుణ పాదయాత్ర చేపట్టారు. ప్రత్యేక గద్వాల జిల్లా కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిరాహార దీక్ష సైతం చేశారు. సీనియర్ నాయకురాలిగా ఎదిగిన ఆమె పలు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఆర్డీఎస్ సంఘర్షణలో డీకే అరుణ మొదటి సారి బయటికి వచ్చి 2003లో అఖిలపక్షం నాయకులతోకలిసి అక్రమ రంధ్రాలను మూసివేయడానికి కర్ణాటక వెల్లారు. తదనంతరం ఎమ్మెల్యేగా గెలిచి 2006లో వైఎస్ఆర్ ను ఒప్పించి ఆర్డీఎస్ అక్రమ రంధ్రాల మూసివేతలో కీలక పాత్ర వహించారు.

**రాజకీయ ప్రస్థానం:** 1960లో నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలో జన్మించిన డీకే అరుణ తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, ఎమ్మెల్యేగా గద్వాల శాసన సభ నుంచి ప్రాతినిధ్యం వహించారు. - 2004-2018వరకు ప్రత్యక్ష రాజకీయంలో ఉన్నారు.

- 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో స్థానం పొంది ఉమ్మడి పాలమూరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించారు.
- తొలి మహిళా నేతగా రికార్డు కూడా సాధించారు. కుటుంబ నేపథ్యం కూడా రాజకీయంలో ఉండడంతో బాగా కలిసివచ్చిందని చెప్పవచ్చు. ఆమె తండ్రి చిట్టెం నర్సి రెడ్డి, సోదరుడు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మక్తల్ నియోజకవర్గంలో గెలుపొందగా, ఆమె మామ, భర్త గద్వాల నుంచి ఎన్నికయ్యారు.
- 1996లో మహబూబ్‌నగర్ లోక్ సభ స్థానం నుంచి పోటి చేసి కేవలం 3700ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి మల్లికార్జున్ చేతిలో ఓటమి పాలయ్యారు.
- డీకే అరుణ 1996,1998,1999లో గద్వాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు.
- 2004లో తొలిసారి గద్వాల నుంచి కాంగ్రెస్ రెబల్‌గా పోటిచేసి జిల్లాలోనే అత్యధిక మెజార్టీ సంపాదించి ఎమ్మెల్యేగా గెలుపొంది ఇక వెనుతిరిగి చూడలేదు.
- 2009లో ఎన్నికల్లో రెండోసారి గెలిచి రాష్ట్రం మంత్రివర్గంలో చోటు సంపాదించారు. చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.
- 2014లో గెలిచి హ్యాట్రిక్ విజయంతో రికార్డు సాధించారు.
- 2018లో కాంగ్రెస్ తరఫున గద్వాల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలయ్యారు.
- 2019నుంచి మార్చిలో అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరారు. 2020 సెప్టెంబర్ 27నుంచి అప్పటి నుంచి ప్రస్తుతం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. అయితే 2023 అసెంబ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేయలేదు. ఆమె కూతురు స్నిగ్ధరెడ్డి బరిలో నిలుస్తారనుకున్న అది కూడా జరగలేదు.
- 2024 జూన్‌లో వెలువడిన ఎన్నికల ఫలితాల్లో 5,10,747 ఓట్లు సాధించి మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలిచారు.



**నేడు ప్రమాణ స్వీకారం :** మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిచిన డీకే అరుణ మంగళవారం పార్లమెంట్ లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల సమయంలో ప్రధాని సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఆమె ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. డీకే అరుణ నేడు ప్రమాణ స్వీకారం సందర్భంగా పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకోనున్నారు.

## భరోసా సెంటర్లో ఈవ్-టీసింగ్‌పై అవగాహన కార్యక్రమం..

**వనపర్తి ప్రతినిధి జూన్ 24 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి, ఆదేశానుసారం వనపర్తి జిల్లా ఎహెచ్‌టియు (మానవ అక్రమ రవాణా నిరోధక విభాగము) వనపర్తి టౌన్ లోని గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ బాలికల నందు ఎహెచ్‌టియు యొక్క కార్యకలాపాలు, ఈవ్-టీసింగ్ గురించి, మహిళపై చిన్నారులపై జరుగు నేరాలు, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, మహిళా రక్షణ, సైబర్ నేరాలు మొదలగు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎహెచ్‌టియు ఇంఛార్జి ఎస్సై అంజద్ మాట్లాడుతూ షీటీం అంటే ఏమిటి? ఇది ఎలా పని చేస్తుంది ? షీటీంను ఎలా సంప్రదించాలి, యు టీజింగ్, హ్యూమన్ ట్రాఫిక్ కింగ్, ఉమెన్ హెల్ప్ డెస్కులు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం, బాల్య వివాహాలు బాల కార్మికుల సరిహద్దు కార్మికులు ఇంటర్నెట్ భద్రత మా చేతుల్లో ఉంది మీ సమాచారాన్ని రక్షించండి. సైబర్ స్టాకర్లు పిల్లల సైబర్ భద్రతను ఎలా ట్రాప్ చేస్తున్నారో మీ వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయవద్దు. సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవలసిన రక్షణ, భద్రత కొలతల గురించి చిన్నపిల్లలను వెట్టిచాకిరి నుండి బయటపడేసి వారి బాల్యాన్ని అందమైన జీవితంగా మలచుకోవడానికి బాటలు వేయాలని తెలిపారు. అదే విధంగా ఎవరైనా బాలల చేత పనులు చేయిస్తే వారు బాలకార్మిక చట్టం కింద శిక్షర్హులు అవుతారని, 14 సంవత్సరాలలోపు బాలబాలికలను పనిలో పెట్టుకోకూడదని, అలాగే మహిళలను



ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అంజద్ పాషా

మానవ అక్రమ రవాణా
నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం
చిన్న పిల్లల రక్షణ విషయంలో
జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు
14 సంవత్సరాలలోపు
బాలబాలికలను పనిలో పెట్టుకోవద్దు
ఆపద సమయంలో డయల్ 100 కు కాల్ చేసి
పోలీస్ వారికి సమాచారం ఇవ్వండి
ఎహెచ్‌టియు ఇంఛార్జి ఎస్సై అంజద్

ఉద్దేశించి తెలుపుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో పాటు స్త్రీలు సమానంగా పోటీ పడుతున్నారని ఉన్నత చదువులు చదువుకొని ఇంకా ఉన్నతమైన ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. ఎలాంటి ఆపద సమయంలో నైనా డయల్ 100కు కాల్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని అన్నారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు. మానవ అక్రమ రవాణాలను నిర్మూలించడానికి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎహెచ్‌టియు ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆకతాయిలు వలన మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే మహిళ హెల్ప్ లైన్ 1091/181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098/112, సైబర్ క్రైమ్ 1930 నంబర్లకు ఫోన్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా కానీ ఫిర్యాదులు చేయవచ్చు. ఫిర్యాదును అందుకున్న వెంటనే ఎహెచ్‌టియు పోలీసులు బాధిత మహిళలకు అండగా నిలుస్తారని. ఈ కార్యక్రమంలో షీటీం హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల
## హామీలు అమలు చేయాలి..

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ**

**వీపనగండ్ల జూన్ 24 ప్రభాతవార్త :** సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నాడు మండల కమిటీ సమావేశం బొల్లారం గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధాలనాపై ఉద్యమాలకు సిద్ధం కావాలని, రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు చేయాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆయన తెలిపారు. గతం కంటే ప్రజాదరణ బిజెపి పై తగ్గిందని, అంతేగాక సీట్లు తగ్గాయని ఆయన అన్నారు. తగ్గాడానికి కారణాలు బిజెపి ప్రభుత్వం గత పాలన సందర్భంగా అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలు అని ఆయన అన్నారు. జిఎస్టి, పెద్ద నోట్ల రద్దు, రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాల వల్ల దేశంలో బిజెపికి ప్రజల్లో బలం తగ్గిందని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ

400 సీట్లు వస్తాయనుకున్న బిజెపికి 240 మాత్రమే వచ్చాయని, తన ఎన్డీఏ కూటమి కలుపుకుంటే 292 సీట్లు వచ్చాయని, ఆయన రాజ్యాంగాన్ని మార్చాలని పూనుకున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తగిన విధంగా తీర్పు ఇచ్చారని తెలిపారు, నీట్ పరీక్షను రద్దు చేయాలని, బొగ్గు బ్లాక్‌లను వేలం పాట రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని వంద రోజులు పూర్తి అవుతున్న ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం తగిన విధంగా లేదని రైతులకు రుణమాఫీ అమలు చేయాలని కోరారు. పెన్షన్లను కూడా పెంచలేదని వాటిని వెంటనే పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇతర హామీలు వెంటనే అముల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బర్, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం కృష్ణయ్య, మహబూబ్ బాషా, పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, మండల నాయకులు వీ కృష్ణయ్య, బాలగౌడ్, సిహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, రవి, నిరంజన్, నాగరాజు, వెంకట్‌స్వామి, వెంకటమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం

**అఖిల ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్**

**వనపర్తి ప్రతినిధి జూన్ 24 ప్రభాతవవార్త :** సోమవారం నాడు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని మర్యాదపూర్వకంగా కలిసి వనపర్తికి వచ్చిన సందర్భంగా పూలబోకే ఇచ్చి సమస్యల మాల వేసి ధన్యవాదాలు పలికిన అఖిలపక్ష ఐక్యవేదిక దాంతో పాటు ప్రజావాణి కార్యక్రమంలో పలు సమస్యలపై వినతి పత్రం ఇచ్చి పలు డిమాండ్లు ముందుంచిన అఖిలపక్ష ఐక్యవేదిక. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ మాట్లాడుతూ, కొత్తగా వచ్చిన కలెక్టర్ కి ఆహ్వానం పలుకుతూ, వనపర్తిలో తిష్ఠ వేసిన సమస్యలు, పలు అక్రమాలపై మొత్తంగా ఎనిమిది అంశాలపై ప్రజావాణిలో వినతి పత్రాలు ఇచ్చిన సందర్భంగా, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన అక్రమాలు వెలికి తీయాలని మతా శిశు సంరక్షణ అంబులెన్స్, ఇతర సామాగ్రి అమ్ముకున్న దానిపై, కార్మికుల వేతనాలు గోల్ మాల్ పైన. మాజీ ఎమ్మెల్యే జయరాములు పేరుపై ఉన్న ప్రభుత్వ అతిధి గృహాన్ని వెంటనే



జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇస్తున్న అఖిల ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్

పునఃప్రారంభించాలని, పాత బస్టాండులో అన్ని షేపులు తీసివేసి చైనా బజారు ఒక్కటే ఉంచడంపై, దానికి కొత్త బస్టాండులో స్థలం ఇచ్చినా కూడా కొందరు స్వార్ధపరులు వారితో కుమ్మకై దాన్ని ఖాళీ చేయకుండా ఉంచడంపై వెంటనే పాత బస్టాండు పున ప్రారంభించాలని. మున్సిపాలిటీలో తయ్ బజార్, ఇతర వసూళ్లలో గోల్మాల్ పై ఫిర్యాదు ఎలాంటి టెండర్లు లేకుండా చిరు వ్యాపారులకు ఉపశమనం కలిగించే అవకాశం కలిగించాలని, ఇంకా పలు అంశాలపై కలెక్టర్ అవగాహన చేసుకుని వాటిపై ఎంక్వాయిరీ చేయించి వనపర్తి ప్రజలకు సేవ చేయాలని కొరుతూ ఈ డిమాండ్ల పై ఒక నెల రోజులు టైం ఇచ్చి కాకపోతే కార్యాచరణ చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు నాగరాజు, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, నాయకులు శివకుమార్, చందు, నాయి బ్రహ్మణ జిల్లా అధ్యక్షుడు అశ్విని రమేష్, అంజి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపాస్ లక్ష్మణ్**

**తెల్కపల్లి, జూన్ 24 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపిడిఓ కార్యాలయానికి చేరుకుని ఎంపిడిఓకు కార్మికుల వేతనాలు పలు సమస్యల పరిష్కారంపై వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు అత్యధికంగా దళిత, సామాజిక బడుగు, బలహీన వర్గానికి చెందిన వారు ఉన్నారని రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులలో వారి కుటుంబాలతో జీవనం సాగిస్తుంటారని అలాంటివారు గ్రామ పంచాయతీలో ఉద్యోగ కార్మికులుగా ప్రభుత్వానికి ప్రజలకు సేవలందిస్తుంటే ప్రభుత్వాలు గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం లాగా వ్యవహరిస్తే గత ప్రభుత్వానికి చెప్పిన బుద్ధి ఈ ప్రభుత్వానికి కూడా చెప్పాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో కార్మికులకు వెంటనే బకాయి వేతనాలను చెల్లించాలని కోరారు. లేని ఎడల ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగుల కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ మహేష్, మండల ఉపాధ్యక్షులు వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం మండల నాయకులు విజయగౌడ్, కెవిపిఎస్ మండల సభ్యులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఓకు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

## ఆర్యవైశ్య వైద్య విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

**కొత్తకోట జూన్ 24 ప్రభాతవార్త :** ఆర్యవైశ్య కుటుంబం అనగానే నేటి సమాజంలో ఆర్థికంగా బలంగా ఉన్నవారే అనుకునే రోజుకు ఇవి.. అలాంటి పరిస్థితి లో పూటకు గడవని కుటుంబాలు కూడా ఆర్యవైష్యులు ఉన్నారనేది తెలుస్తుంది. కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన భీమా మాధురి కుటుంబం ఉంది. వీరికున్న స్తోమత వలన తమ కూతురిని మంచిగా చదివించుకున్నారు. భర్త భీమా ఆంజనేయులు చనిపోయిన తర్వాత వారి ఆర్థిక ఇబ్బందుల వలన పై చదువులు చదివించలేకపోయింది. మెడికల్ కోర్స్ లో సీట్ రావడంతో తల్లి సంతోషించింది. కానీ ఫీజ్ కట్టలేని పరిస్థితి ని తలుచుకొని తలదించుకుంది. వీరికి ఉన్న ఆర్థిక ఇబ్బందుల వలన అప్పు ఇచ్చేవారు లేరు ఆదుకునే వారు కూడా లేకపోలేదు. ఈ విషయాన్ని స్థానిక ఆర్యవైశ్య నాయకుల దృష్టికి తీసుకెళ్ళింది వారు వెంటనే స్పందించి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారికి కుటుంబ పరిస్థితి ని వివరించారు. ఎమ్మెల్యే స్పందించి మెడికల్ కోర్స్ మొదటి సంవత్సరం గాను 50 వేలు నగదును విద్యార్థికి అందజేసి మానవత్వం చాటుకున్నారు. అడిగిన వెంటనే పెద్ద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ఆర్యవైశ్య నాయకులు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు భీమా చంద్రకాంత్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్ద విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే

## వెల్కిచర్లను ఎస్సీ రిజర్వుగా ప్రకటించాలి..!!

**-కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వెల్కిచర్ల దళితులు..**



**భూత్పూర్, జూన్ 24, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం వెల్కిచర్లలో ఎస్సీ ఇతర దళిత సామాజికవర్గం అధికశాతం ఉన్నందున రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో వెల్కిచర్లను ఎస్సీ రిజర్వ్డ్‌గా ప్రకటించాలని కోరుతూ గ్రామానికి చెందిన ఎస్సీ, దళిత సామాజిక వర్గం సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, పంచాయతీ సెక్రటరీలకు విడివిడిగా వినతి పత్రాలు సమర్పించారు. స్వాతంత్ర్యం ఏర్పడిన నాటి నుంచి దళితకుటుంబాలు అధికంగా ఉన్న వెల్కిచర్లకు ఎస్సీ రిజర్వ్డ్ చేయలేదని, ఈ సారైనా వెల్కిచర్లను ఎస్సీ రిజర్వు కింద ప్రకటించాలని దళితులు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఇటిక్యాల, జూన్ 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండేరు గ్రామానికి చెందిన కటిక భాష (50) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉండగా గత శుక్రవారం మధ్యాహ్నం ఎర్రవల్లి నుండి తన సొంత గ్రామం కొండేరు గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అదే దారిలో హైదరాబాద్ నుండి కర్నూలు వైపు వెళ్లే కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా కటిక భాష కింద పడిపోవడంతో తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం హైవే అంబులెన్స్‌లో కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## గుర్తు తెలియని
## వ్యక్తి శవం లభ్యం : ఎస్సై బి.నరేష్

**తెల్కపల్లి, జూన్ 24 ప్రభాతవార్త :** గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బి. నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని దాసుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో హై టెన్షన్ పవర్ లైన్ పక్కన నెమలి చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి (42)మృతి చెందినట్లు సోమవారం స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం దాదాపు 5 రోజుల క్రితం మరణించినట్లు తెలుస్తుందని మృతదేహం కుళ్లిపోయినట్లు ఎస్సై తెలిపారు. మృతుని ఒంటిపై తెల్లని చొక్కా, నలుపు రంగు లుంగీ, చేతికి గడియారం ధరించి ఉన్నాడని ఎస్సై తెలిపారు. పూర్తి సమాచారం కోసం ప్రయత్నిస్తున్నట్లు వారు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే ఈ క్రింది నంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు. 8712657715 ఎస్సై తెల్కపల్లి, 8812657711 సిఐ నాగర్‌కర్నూల్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



ఉరి వేసుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

## డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం



డిప్యూటీ సీఎంను శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**వెల్దండ, జూన్ 24 ప్రభాతవార్త:** హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో శ్రీశైలం మల్లిఖార్జునస్వామి దర్శనానికి వెళ్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావులకు వెల్దండ మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి భట్టి విక్రమార్కను శాలువాలతో సన్మానించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మొదటి సారి వెల్దండ మండల కేంద్రానికి రావడంతో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జాతీయ రహదారిపైకి వచ్చి డిప్యూటీ సీఎంతో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, తక్కళ్లపల్లి శేఖర్, హమీద్, రషీద్, పుల్లయ్య, భయ్య మల్లయ్య, క్యాసారపు వెంకటయ్య, సమీర్ అహ్మెద్ షేక్, ముదిగొండ రమేష్, ఎర్ర శ్రీను ముదిరాజ్ ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



**వెల్దండ, జూన్24 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇవ్వడంతో మండల కేంద్రంలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులతో కలిసి సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతును రాజును చేయడమే లక్ష్యంగా రైతులకు రుణం నుంచి విముక్తి కల్పించి వారికి అన్ని విధాలుగా అభివృద్ధి చెందే విధంగా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టమన్నారు. కార్యక్రమంలో ఈకార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, తక్కళ్లపల్లి శేఖర్, హమీద్, రషీద్, పుల్లయ్య, భయ్య మల్లయ్య, క్యాసారపు వెంకటయ్య, సమీర్ అహ్మెద్ షేక్, ముదిగొండ రమేష్, ఎర్ర శ్రీను ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, జూన్ 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ రాష్ట్ర నాయకులు సంతోష్ ఆధ్వర్యంలో ఎంఈఓ శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించడంతో పాటు యూనిఫామ్స్, పుస్తకాలను అధిక ధరలకు వసూలు చేస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎంఈఓ స్పందించి ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు రాహుల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

**కొత్తకోట, జూన్24 ప్రభాతవార్త :** మదనాపురం మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐఎం మండల కార్యదర్శి వెంకట్రాములు ఆధ్వర్యంలో ఇండ్లలో ఉంటున్న ప్రజలందరూ కలిసి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహసిల్దార్ అబ్రహం లింకన్, ఎంపీఓ పుష్పకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడారు. లబ్దిదారులకు ఇండ్లను ఇచ్చిన 8 నెలలు అయ్యిందని, వసతులు లేక సతమతం అవుతున్నారని గుర్తు చేశారు. త్రాగడానికి మంచి నీటి వసతి లేక బిందెలతో దూరం వెళ్లి తెచ్చుకుంటు త్రాగే పరిస్థితి వచ్చిందన్నారు. బాత్రూమ్ లోని నీళ్ళు బయట రోడ్లపై పారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీలు లేకపోవడంతో బురదలోనె నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. వాటి వల్ల దోమల బెడద ఎక్కువ అయ్యి రోగాలు వస్తున్నాయని వెల్లడించారు. ఇండ్లలో వసతుల ఏర్పాటు సక్రమంగా లేకపోవడంతో కిరాయిలు ఇండ్లలో ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించి లబ్దిదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చీర్ల ప్రసాద్, వెంకటేష్, చెన్నయ్య, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల ప్రజలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేయరాదు



బాల్య వివాహాలు చేయరాదని అవగాహన కల్పిస్తున్న శకుంతల, శ్రీనివాస్ యాదవ్

**లింగాల, జూన్24 ప్రభాతవార్త:** 18 సంవత్సరాల్లోపు బాల బాలికలకు బాల్య వివాహాలు చేయరాదని పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, శకుంతల అన్నారు. సోమవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి, శ్రీరంగపూర్ గ్రామాల్లో కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వయస్సులో పిల్లలకు వివాహాలు చేయరాదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వయస్సులో వివాహాలు చేయడం వల్ల కలిగే దుష్పలితాల గురించి వివరించారు. బాల్య వివాహలు నిర్వహించడం వల్ల వధువు కుటుంబ సభ్యులకు, బంధువులకు శిక్ష పడుతుందని, బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం 2006 లోని 10వ సెక్షన్ ప్రకారం బాల్య వివాహాన్ని నిర్వహించే, నిశ్చయించే లేదా ప్రోత్సహించే వ్యక్తికి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడుతుందని, ఒక లక్ష రూపాయల వరకు జరిమానావిధించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు సలేమ్మ, సువర్ణ, ఆశా కార్యకర్తలు భాగ్యమ్మ, తేజశ్రీ, కోనేరు సంస్థ కో ఆర్డినేటర్‌లు ఆంజనేయులు, శ్రీనివాస్ యాదవ్, గ్రామ ప్రజలు రాము, సలేశ్వరం, యాదయ్య పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వండి

**కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించిన సిఐటియు నాయకులు**



ఆందోళన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 24 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు కిల్లెగోపాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మోరీ, చెత్తచెదారం, కళేబరాలనుఎత్తిపారేసి, నీళ్ల వదలడం, కరెంటును వేయడం, తీయడం పనులు చేస్తున్న సిబ్బందికి ఆదాయాలున్న గ్రామ పంచాయతీలోనూ, చిన్న గ్రామ పంచాయతీలోనూ, కొత్తగా గ్రామ పంచాయతీగా రూపొందించిన తండాల్లోనూ గ్రాంట్స్ లేవనే పేరుతో జీతాలు ఇవ్వకపోవడాన్ని ప్రభుత్వ అధికారుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందులో సిఐటియునాయకులు వర్ధగాలన్న, సత్యన్న, తిరుమలయ్య, రాజ్‌కుమార్, ఆంజనేయులు, పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి న్యాయమైన సమస్యల కోసం ఖచ్చితంగా పోరాడుతామని ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. అనంతరం అధికార ప్రతినిధి బృందంగా డిపిఓ విజయేంద్రనాథ్, డిఎల్‌పిఓ పండరినాథ్ ధర్నా దగ్గరికి చేరుకుని సామరస్య పూర్వకంగా వారి సమస్యలను విన్నారు. జీతాలు ఇవ్వకపోవడం వాస్తవమేనని, గ్రాంట్స్ రాకపోవడంతో, కుబేర్ యాప్ ఓపెన్ కాకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఖచ్చితంగా జీతాలు ఇప్పించే విధంగా కృషి చేస్తామని సిబ్బందికి హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ ప్రతినిధి బృందం కలెక్టర్ విజయేంద్రబోయి, లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్‌తో దృష్టికి తీసుకెళ్లి జీతాలు ఇప్పించేలా కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కృష్ణయ్య, రవి సాగర్, వెంకటేష్, వెంకటయ్య, పద్మా, వెంకటమ్మ, చంద్రమ్మ, వేణు, అచ్చలమ్మ, చెన్నయ్య, పెంటయ్య, నారాయణ, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

**రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసేదే కాంగ్రెస్ ప్రభుత్వం : దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**కొత్తకోట జూన్24 ప్రభాతవార్త:** రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసేదే కాంగ్రెస్ ప్రభుత్వమే అని ప్రతి రైతు ఆయకట్టుకు సాగునీరు అందించి తిరుతామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట మండలం మిరాస్ పల్లి గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్యతితులుగా హాజరయ్యారు. ముందుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, మునిఫామ్స్ అందజేశారు. అనంతరం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరించి, సభను ఉద్దేశించి ప్రసంగించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓట్లేసి మెజార్టీ ఇచ్చిన మిరాస్ పల్లి గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు త్వరలో ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. తదనంతరం గ్రామంలో విస్తృతంగా పర్యటించి గ్రామంలో దర్గాను దర్శించుకుని, గ్రామంలోని పలు కుల సంఘాల కమ్యూనిటీ భవనాలు పరిశీలించారు. ఎస్సీ కాలనీ లో పర్యటించి, సమస్యలుఅడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా కాలనీలోని విద్యుత్ సమస్య గురించి తెలుసుకుని సమస్య పరిష్కారించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని తప్పకుండ ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెపాగు ప్రశాంత్, జిలల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్, సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివ రాములు, రావుల జితేందర్‌రెడ్డి, బిమ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఉమ మహేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, గిన్నెశ్రీనివాస్‌రెడ్డి, కానాయపల్లి గోకరయ్య పాల్గొన్నారు.

# సామాజిక సేవలో యువ జాగృతి ఫౌండేషన్

● 22 పాఠశాలలను దత్తత ● విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ సహకారంతో కార్యక్రమాలు



జడ్చర్ల పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్24 ప్రభాతవార్త:** యువజాగృతి ఫౌండేషన్ సభ్యులు సామాజిక సేవలో తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పేద విద్యార్థులకు విద్యనందించే కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. సోమవారం జడ్చర్ల పట్టణంలో పదో వార్డు మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిల్స్, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవరావు, శేషగిరిరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించడం కోసం, ప్రతిభను వెలికి తీయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలోని 22 ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను దత్తత తీసుకుని వారికి ఉచిత నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, దాదాపు 180 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.20 వేల విలువ గల నోట్ బుక్స్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎంతోఅదృష్ట వంతులని చదివి స్తున్నందుకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువజాగృతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుసూదన్‌రెడ్డి మాట్లా డుతూ చాలామంది తల్లిదండ్రులకు పిల్లల చదువుల కొరకు చేసే ఖర్చు చాలా భారంగా మారిందని కావున ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారికిఅర్హత కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు విద్య అందించాలని దృఢ సంకల్పంతో విద్యా స్వేచ్ఛఫౌండేషన్ వారితో కలిసి పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారదా, ఉపాధ్యాయులు అనురాధ, సువర్ణ, కౌన్సిలర్ శశికిరణ్, పాఠశాల పూర్వ విద్యార్థి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఆవంచ గ్రామంలో... నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో కేంద్ర ప్రాథమిక పాఠశాల, (సిపిఎస్), మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (జిపిఎస్) లో ఒక్కో పాఠశాలకు రూ. 40 వేల రూపాయల విలువ గల నోట్‌బుక్స్, పెన్సిల్స్, పెన్నులు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిఎఓ బ్రహ్మాచారి, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు అమృత, సిపిఎస్ పాఠశాలలప్రధానోపాధ్యాయులు నరెందర్, ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల అభివృద్ధి కోసం కృషి

**నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతాల**



**అయిజ జూన్ 24 ప్రభాతవార్త:** నిస్వార్థంగా సహకార సంఘాల అభివృద్ధి కోసం కృషి చేస్తే ప్రత్యక్షంగా రైతాంగాన్ని అన్ని రకాలుగా ఆదుకునే వారమవుతామని అభ్యున్నతికి మనమే కారకులమవుతామని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతాల అన్నారు. సోమవారం నాడు అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా చూసేందుకు నాబార్డ్ డీజీఎం శ్వేతా సింగ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఫర్టిలైజర్, క్రిమిసంహారక మందులు, సూపర్ మార్కెటనదుకాణాలను ఇతర అధికారులతో కలిసి ప్రత్యేకంగా ఆసక్తితో గమనించారు. గతంలో నష్టాలతో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని స్థితిలో ఉన్న అయిజ పిఎసిఎస్ సొసైటీని అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి, పాలకవర్గం, సిబ్బంది సహకారంతో అనతి కాలంలోనే గణనీయమైన ఆర్థిక అభివృద్ధి సాధించి మిగతా సొసైటీలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనే ఏర్పాటుచేసిన సూపం మార్కెట తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులను అందిస్తూ, అతి తక్కువ కాల వ్యవధిలోనే గణనీయమైన అభివృద్ధి సాధించిందని సొసైటీ గణాంకాలు తెలుపుతున్నాయని ఆమె అన్నారు. మహబూబ్‌నగర్ డిసిసిబి బ్యాంకు తోపాటు జిల్లాలోని అభివృద్ధి చెందున్నకొన్ని సహకార సంఘాల్లో అయిజ సొసైటీ ఒకటిగా చేరిందని, ఇటువంటి విషయాలని డాక్యుమెండేషన్ చేసి మిగతా సొసైటీలకు తెలిసేలా రికార్డు చేయాలని డిడిఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సింగిలహ్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అయిజ సొసైటీ అభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని సొసైటీకి కేటాయించిందని, ఆట్టి భూమిలో గోదాములు నిర్మించేందుకు , అలాగే పులికల్ గ్రామ పరిధిలో నాగలదిన్నె వంతెన సమీపంలో పెట్రోల బంక్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కొరగా అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మహబూబ్ నగర్ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి తెలకపల్లి లక్ష్మయ్య, మానోపాడు, వడ్డేపల్లి పిఎపిఎస్ చైర్మన్లు శ్రీధర్, గోపాల్ రెడ్డి, నాబార్డ్ డీడీఎంలు షణ్ముగ చారి మనోహర్ రెడ్డి, బ్యాంకు పిడి సెల్ ఇన్చార్జి అధికారి ఆశోక్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ అయ్యప్ప రెడ్డి, సొసైటీ కార్యదర్శి మల్లేష్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టికి గౌరవ వందనం

- గజమాలతో సన్మానం - డిప్యూటీ సీఎంకు అధికారులు, ప్రజా ప్రతినిధుల ఘన స్వాగతం



డిప్యూటీ సీఎంను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

**అచ్చంపేట, జూన్ 24 ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించడానికి వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని వెల్దండ, వంగూరు, అచ్చంపేట, మన్ననూర్, ఈగలపెంట గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్‌మండలంలోని మన్ననూర్ గ్రామంలోని అతిథి గృహంలో డిప్యూటీ సీఎంకు పోలీస్ లాంఛనాలతో రక్షకభటులు గౌరవ వందనం అందించారు. అదే విధంగా వంగూరు మండలం శ్రీశైలంటర్నింగ్‌లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తూడి మేఘారెడ్డిలు గజమాలతో సన్మానించి స్వాగతం పలికారు. మన్ననూర్‌లో జిల్లాకలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లతో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

## ఎంపీ మల్లురవికి ఘన సన్మానం

-ఆత్మీయ అభినందన సభలో అభినందనల వెల్లువ...



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్24 ప్రభాతవార్త:** ఇటీవల నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీ మల్లురవికి మండల పరిధిలోని గగ్గలపల్లి గ్రామ శివారులో ఒక ఫాంహౌస్‌లో కాంగ్రెస్ పార్టీ నేత భగవంతురెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీ మల్లురవి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఎంపీ మల్లురవికి ఘన స్వాగతం పలికి పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ తన విజయం వెనుక కార్యకర్తలశ్రమ, ప్రజలఅభిమానంఎంతో ఉందని, రాబోవు ఐదు సంవత్సరాలు పార్లమెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఉపాధి రంగాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశ్రమలను ఏర్పాటు చేసి ఇచ్చిన హామీలను అమలు చేస్తానన్నారు. కార్యక్రమంలోనాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం

**కొత్తకోట జూన్ 24 ప్రభాతవార్త:** మా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం ప్రజలకోసం పని చేస్తది. అధికారులకు, కాంట్రాక్టులను మా నాయకులు అండగా ఉంటారు, ఎక్కడ ఎ పనులు ఆపొద్దు పెండింగ్లో ఉండొద్దు అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం కొత్తకోట సమీపంలోని భీమా ఫేజ్-2 పంప్ హౌస్ వద్ద ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్,బి కొత్తకోట మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ అధికారులతో మాట్లాడుతూ ఆయా మండలాల్లో చాలా కాలంలో పెండింగ్లో ఉన్న పనులను గుర్తించి, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించి, పనులు వేగవంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్ ను ఇష్టానుసారంగా కరెంట్ ను తీస్తూ గ్రామీణ ప్రాంతాలా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యుత్ అధికారులపై మండిపడ్డారు. అందుకని ప్రతిగ్రామంలో అధికారులు స్వయంగా పర్యటించి సమస్యలు తెలుసుకుని తమ, తమ స్థాయిలో వారు పరిష్కరించాలని, పరిష్కారం కానివి ఏవైనా ప్రపోజల్స్ తీసుకొస్తేపై అధికారులతో లేదా సంబంధిత మంత్రితో చర్చించి సమస్యలను పరిష్కారం చేద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెపాగు ప్రశాంత్, జిల్లా కార్యదర్శులు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు బిచుపల్లి, మాజీ జడ్పీటీసీ బాబు, సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి, గొల్లబాబు, శేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, రావుల జితేందర్ రెడ్డి, గోకరయ్య, నవీన్, మోహన్‌రెడ్డి, వెంకటేష్, మసన్న, శివరాములు పాల్గొన్నారు.

## ఫుడ్‌సేఫ్టీ అధికారుల అకస్మిక దాడులు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ, ఆదర్శ రెసిడెన్షియల్ వసతి గృహాల్లో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ మనోజ్ తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ, ఆదర్శ రెసిడెన్షియల్ వసతి గృహాల్లో తనిఖీ చేశారు. తనిఖీల్లో పిల్లలకు పాఠశాలలు పున: ప్రారంభమైనందున నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వివిధ రకాలైన మూడు పదార్థాలను తనిఖీ చేశారు. అదే విధంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేస్లీ తాండ గ్రామ పంచాయతీ పరిధిలోని పాల కేంద్రాలను తనిఖీ చేసి పాలలో ఏమైన కల్తీ పదార్థాలను కలుపుతున్నారా అనే నిర్ధారణకు శాంపిల్స్‌ను సేకరించారు. కల్తీ నిర్ధారణ అయితే చట్టపరమైనచర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ మనోజ్ పేర్కొన్నారు.

## స్టేట్ 4వ ర్యాంక్ సాధించిన విద్యార్థికి ఘన సన్మానం

**కల్వకుర్తిటౌన్, జూన్24 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినీ పేదింటి రైతు బిడ్డ ఆదిలక్ష్మి హెచ్‌ఈసీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 453 మార్కులు సాధించి రాష్ట్ర 4వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో గురువులు చెప్పిన ప్రకారం చదువుకొని స్టేట్ ర్యాంక్ సాధించిన ఆదిలక్ష్మి కళాశాలకు, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తెచ్చిపెట్టిందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఆదిలక్ష్మిని ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, హిస్టరీ అధ్యాపకులు సదానందంగౌడ్‌లతో పాటు కళాశాల యాజమాన్యం శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**కల్వకుర్తి, జూన్ 24 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనందకుమార్ మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తానని హామీ ఇచ్చారని, దీంతో రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారనారు. ఏకకాలంలో రుణమాఫీ ప్రక్రియకు సంబంధించి విధి విధానాలు వచ్చే నెల ప్రక్రియ ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## పాల బిల్లు కోసం రైతుల ఆందోళన

-2 నెలలుగా అందని పాల బిల్లులు

**కల్వకుర్తిరూరల్, జూన్ 24 ప్రభాతవార్త:** 2 నెలలుగా పాల బిల్లులు అందక పాడి రైతులుఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాల బిల్లులే జీవనాధారంగా ఉన్న పాడి రైతులకు బిల్లులు అందకపోవంతో తమకు రావాల్సిన బిల్లులను వెంటనే అందించాలని ధర్నా చేపట్టారు. కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామ సమీపంలో సోమవారం పాలబిల్లుల కోసం రైతులు మహబూబ్‌నగర్- కోదాడ రోడ్డుపై భైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ 2 నెలలుగా పాలబిల్లులు రాకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆవేదనవ్యక్తం చేశారు. పాల బిల్లులే జీవనాధారంగా బ్రతుకుతున్నామని, ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు పాల బిల్లులను సకాలంలో అందించాలన్నారు. పాల బిల్లులు రాకపోతే రైతులందరు కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ధర్నా చేస్తున్న పాడి రైతులతో పోలీసులు మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో పాడి రైతులు ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం..

కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి సోమవారం కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని, వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి సమాచారాన్ని ఫిర్యాదు దారునికి పంపటమే కాకుండా నివేదికను తనను పంపించాలని ఆదేశించారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (97) ఫిర్యాదులు వచ్చాయి. వచ్చే వారం నుండి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఆఫీస్ అమలు వచ్చేవారం నుండి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఆఫీస్ ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని ఆదేశించారు. అందుకు అవసరమైన లాగిన్‌లు, శిక్షణ కార్యక్రమం ఈ వారంలో పూర్తి కావాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, జిల్లా అధికారులు, విడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసిల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.